

6 గ్యారంటీలను అమలు చేయకుంటే
## మెడలు వంచుతా
- గ్రామాల్లోని అభివృద్ధి కేంద్రం చలువే..
- ఎంపీ బండి సంజయ్ కుమార్

- వివరాలు 4లో..



## వంశీ గెలుపునకు అహర్నిశలు కృషి చేయాలి
- మరోసారి కాంగ్రెస్‌ను ఆశీర్వదించండి
- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు

- వివరాలు 5లో..

TELANGANA CAPITAL సంపుటి 01 | సంచిక 13

# తెలంగాణ క్యాపిటల్
నిజం.. నిజాయితీ.. నిబద్ధత

TELANGANA CAPITAL NEWS
www.telanganacapitalnews.com
కాంప్లిమెంటరీ కాపీ | కరీంనగర్, పెద్దపల్లి, సిరిసిల్ల, జగిత్యాల | మంగళవారం 23 ఏప్రిల్ 2024 | పేజీలు 6



3

### గరుడ వాహనంపై నారసింహుడు
తెలంగాణ క్యాపిటల్, బెజ్జంకి: సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహాస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉత్సవమూర్తులను గరుడ వాహనంపై ఉంచి శోభాయాత్ర నిర్వహించారు.



5

### చిన్న జయంతి ఉత్సవాలు ప్రారంభం
జగిత్యాల జిల్లా కొండగట్టు ఆలయంలో సోమవారం ఉదయం నుండి హనుమాన్ చిన్న జయంతి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామున నుండి గుట్ట పైకి దీక్ష స్వాములు చేరుకొని స్వామి వారిని దర్శించుకున్నారు. మాల విరమణ చేశారు. జై శ్రీరామ్ నినాదాలతో ఆలయ పరిసరాలు మారుమోగాయి. మాల విరమణ ఆనంతరం తలనీలాలు సమర్పించుకుని మొక్కలు చెల్లించుకొని తిరుగు పయనమయ్యారు.



## అట్టహాసంగా.. వెలిచాల నామినేషన్
- హాజరైన మంత్రి పొన్నం, విప్, ఇద్దరు ఎమ్మెల్యేలు
- అన్ని నియోజకవర్గాల నుంచి భారీగా తరలివచ్చిన కార్యకర్తలు
- పూలే గ్రౌండ్ నుంచి కలెక్టరేట్ వరకు అభిమానులతో ర్యాలీ
- ఎన్నికల అధికారికి నాలుగు సెట్ల నామినేషన్ పత్రాలు అందించిన రాజేందర్ రావు
- కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చి గెలిపించాలని మంత్రి పొన్నం పిలుపు

(తెలంగాణ క్యాపిటల్, కరీంనగర్ బ్యూరో)

కాంగ్రెస్ పార్టీ తరపున వెలిచాల రాజేందర్ రావు సోమవారం అట్టహాసంగా నామినేషన్ వేశారు. మొత్తం నాలుగు సెట్ల నామినేషన్ పత్రాలను ఆయన ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పమేలా సత్పతికి అందించారు. అంతకుముందు జ్యోతి బాపూలే గ్రౌండ్ నుంచి కలెక్టరేట్ వరకు భారీగా తరలివచ్చిన అభిమానులు, కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, డీసీసీ ప్రెసిడెంట్, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మాజీ ఎమ్మెల్యే కోడూరి సత్యనారాయణ గౌడ్ తదితరుల ఆధ్వర్యంలో వెలిచాల నామినేషన్ కార్యక్రమానికి బయలుదేరారు. ఆద్యంతం భారీగా తరలివచ్చిన అభిమానులు వెలిచాలకు మద్దతుగా ముందుకు సాగారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించుకుంటామని ముక్తకంఠంతో నినదించారు.

2



## సంజయ్ వెంట సీనియర్లేరీ..?
కరీంనగర్ కాంగ్రెస్‌కు కంచుకోట మంత్రి పొన్నం ప్రభాకర్

## బంగారు కరీంనగర్‌కు బాటలు
కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావు

# అట్టహాసంగా వెలిచాల నామినేషన్

**హాజరైన మంత్రి పొన్నం, విప్, ఇద్దరు ఎమ్మెల్యేలు**

**అన్ని నియోజకవర్గాల నుంచి భారీగా తరలివచ్చిన కార్యకర్తలు**

**పూలే గ్రౌండ్ నుంచి కలెక్టరేట్ వరకు అభిమానులతో ర్యాలీ**

**ఎన్నికల అధికారికి నాలుగు సెట్ల నామినేషన్ పత్రాలు అందించిన రాజేందర్ రావు**

**కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చి గెలిపించాలని మంత్రి పొన్నం పిలుపు**

(తెలంగాణ క్యాపిటల్, కరీంనగర్ బ్యూరో)

కాంగ్రెస్ పార్టీ తరఫున వెలిచాల రాజేందర్ రావు సోమవారం అట్టహాసంగా నామినేషన్ వేశారు. మొత్తం నాలుగు సెట్ల నామినేషన్ పత్రాలను ఆయన ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పమేలా సత్పతికి అందించారు. అంతకుముందు జ్యోతి బాపూలే గ్రౌండ్ నుంచి కలెక్టరేట్ వరకు భారీగా తరలివచ్చిన అభిమానులు, కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, డీసీసీ ప్రెసిడెంట్, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మాజీ ఎమ్మెల్యే కోడూరి సత్యనారాయణ గౌడ్ తదితరుల ఆధ్వర్యంలో వెలిచాల నామినేషన్ కార్యక్రమానికి బయలుదేరారు. ఆద్యంతం భారీగా తరలివచ్చిన అభిమానులు వెలిచాలకు మద్దతుగా ముందుకు సాగారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించుకుంటామని ముక్తకంఠంతో నినదించారు.

**భారీగా తరలివచ్చిన అభిమానులు**

కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చారు. వేలాది సంఖ్యలో తరలివచ్చిన కార్యకర్తల మధ్య అట్టహాసంగా ర్యాలీ నిర్వహించారు. ఇప్పటికే రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన జోష్ కాంగ్రెస్ పార్టీ నేతల్లో కనిపిస్తుండగా.. నిన్న జరిగిన నామినేషన్ ఘట్టంలోనూ ఎవరూ వెనక్కి తగ్గలేదు. అటు మంత్రి పొన్నం ప్రభాకర్ సైతం వెలిచాలకు అండగా నిలవడంతో కార్యక్రమం మరింత విజయవంతమైంది. మండలాల వారీగా కార్యకర్తలు తరలిరావడంతో గీతాభవన్ చౌరస్తా పూర్తిగా కాంగ్రెస్ కార్యకర్తలతో నిండిపోయింది. నగరంలో ఎక్కడ చూసినా కాంగ్రెస్ జెండాలే కనిపించాయి. అటు మంత్రి పొన్నం సైతం కార్యకర్తలను ప్రోత్సహిస్తూ ముందుకు సాగారు. ఆయన సొంత నియోజకవర్గమైన హుస్నాబాద్ నుంచి అభిమానులు భారీగా తరలివచ్చారు. డప్పుల చప్పుళ్లు, డీజేల మోతలతో నగరం మొత్తం దద్దరిల్లింది. 'జై కాంగ్రెస్.. జై జై కాంగ్రెస్.. పొన్నం అన్న నాయకత్వం వర్ధిల్లాలి.. వెలిచాల నాయకత్వం వర్ధిల్లాలి' అంటూ అభిమానులు చేసిన నినాదాలతో సిటీ మొత్తం మార్మోగింది.





## సంజయ్ వెంట సీనియర్లేరీ..?

**కరీంనగర్ కాంగ్రెస్‌కు కంచుకోట**

**జిల్లా అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం**

**మంత్రి పొన్నం ప్రభాకర్**

'బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్ వెంట సీనియర్లు ఉన్నారా..? విద్యార్థి దశ నుంచి ఉన్న గుజ్జుల రామకృష్ణ ఎక్కడ? సుగుణాకర్ ఎక్కడ? విద్యాసాగర్ రావు ఎక్కడ? మురళీధర్ రావు ఎక్కడ? కాంగ్రెస్ పార్టీ వెంట ప్రతీ కార్యకర్త.. ప్రతీ ఎమ్మెల్యే.. మాజీ శాసనసభ్యులు.. పోటీ చేసిన నేతలు అందరు ఉన్నారు' రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం వెలిచాల రాజేందర్ రావు నామినేషన్ అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. సంజయ్ పక్కన మొరిగే వాళ్లతో మాట్లాడిస్తున్నావని, పెద్ద భక్తుడివి అని చెప్పుకునే సంజయ్ ఏం చేశాడని నిలదీశారు. తాను వారానికి రెండు రోజులు తిరుపతి రైలు తెచ్చానని, దానిని రోజు నడిచేలా ఎందుకు చేయలేదని నిలదీశారు. తాను సిరిసిల్ల, కరీంనగర్‌కు కేంద్రీయ విద్యాలయం తెచ్చానని, హుజూరాబాద్‌కు, జమ్మికుంటకు ఎందుకు తేలేదు..? మీ ప్రభుత్వమే కదా కేంద్రంలో ఉన్నది అని ప్రశ్నించారు. 5 ఏళ్లు ఎంపీగా ఉండి వస్త్ర పరిశ్రమకి పన్ను వేస్తే దానిని వ్యతిరేకించాలని దద్దమ్మవి నువ్వు అని విమర్శించారు. అవినీతి ఆరోపణల వల్లే స్థానిక ఎంపీ సంజయ్‌ని పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి తీసేశారో లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ ఐదేళ్లలో ఆయన కరీంనగర్ పార్లమెంటుకు ఏం చేశారో చెప్పాలన్నారు. బాత్రూమ్‌లు కట్టినమా..? అక్షింతలు పంచినమా..? ఈజీఎస్ కార్యక్రమం తెచ్చినమా..? కాదు.. ప్రజలకు చిరస్థాయిగా ఉండే ఓ విద్యా సంస్థ.. వైద్య సంస్థ, ఉపాధి కల్పించే ఒక్క పరిశ్రమ తెచ్చినవా అని నిలదీశారు. ఎక్కడికెళ్లినా రాముడి ఫొటోలు పెట్టుకొని, రాముడి పేరు మీద ఓట్లు అడుగుతూ రాజకీయం చేస్తున్నారని అన్నారు. అసలు నీకు మానవత్వం లేదు విమర్శించారు. పార్లమెంట్ మొదటి దశ ఎన్నికలు పూర్తికాగానే నరేంద్ర మోడీకి భయం పట్టుకుందని, 10 సంవత్సరాలు ప్రధాన మంత్రిగా చేసిన వ్యక్తి దేశానికి చేసింది చెప్పుకునే పరిస్థితుల్లో లేరని దుయ్యబట్టారు. మోడీ మాటలు చూస్తే దేశం సిగ్గుపడే పరిస్థితి ఉందన్నారు. కాంగ్రెస్ వస్తే సంపద అంతా ముస్లింలకు ఇస్తుందని అంటున్నారని.. 85 శాతం హిందువులుగా ఉన్న ఈ దేశంలో 10 సంవత్సరాల ప్రధానమంత్రిగా ఉండి హిందువులకు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. మతపరమైన విద్వేషాలు రెచ్చగొట్టడం వల్ల మెజారిటీ హిందువుల ఓట్లు కొల్లగొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. మోడీ సంపద అంతా దేశ ప్రజలకు ఉపయోగించకుండా.. అదానీ, అంబానీలకు పంచి పెట్టారని విమర్శించారు. కాంగ్రెస్ మేనిఫెస్టో చూసి బీజేపీకి లాగులు తడిశాయని అన్నారు. పాంచ్ న్యాయ్ ద్వారా దేశంలో ఉన్న బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. దేశంలో 10 సంవత్సరాలు బీజేపీ, రాష్ట్రంలో 10 సంవత్సరాలు బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉండి తెలంగాణ కోసం ఏం చేశాయో చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ విభజనను వ్యతిరేకించి అమరవీరులకు అవమానపరిచే విధంగా దొంగదారిన రాష్ట్రాన్ని తెచ్చుకున్నారన్న నరేంద్ర మోడీ వ్యాఖ్యలకు తెలంగాణ ప్రజలు ఓటేయలా అని ప్రశ్నించారు. 10 ఏళ్లలో విభజన హామీలు అమలు చేయలేదని, 7 మండలాలతోపాటు, సీలేరు ప్రాజెక్టును ఆర్డినెన్సు ద్వారా ఎత్తుకుపోయిన మీరు తెలంగాణ ద్రోహులని పేర్కొన్నారు. మాటలకే పరిమితం అయిన మోడీని గద్దెదించాలని అన్నారు. కరీంనగర్ కాంగ్రెస్‌కు కంచుకోట అని, ఈ జిల్లా అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు.

**ఓట్లు కొనుక్కోవాలని చూసిన వ్యక్తి వినోద్..**

పైసలతో ఓట్లు కొనుక్కోవాలనుకున్న వ్యక్తి బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్ కుమార్ అని.. ఆయన బంధువుల హోటల్‌లో 6 కోట్లు దొరికాయని మంత్రి పొన్నం విమర్శించారు. ఆయన గురించి ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిదని ఎద్దేవా చేశారు. 5 ఏళ్ళు ప్రణాళిక బోర్డు మెంబర్‌గా ఉండి.. ఈ నియోజకవర్గానికి ఏం చేశారని నిలదీశారు. ఆయనకు ఓటు ఎందుకు వేయాలన్నారు. నియోజకవర్గానికి చెందిన ఓ జడ్పీటీసీని గుర్తుపడుతావా..? ఒకరికి అయినా షేక్ హ్యాండ్ ఇస్తావా..? నియంతలాగా వ్యవహరించిన మీరు నియోజకవర్గంలో ఎలా ఓట్లు అడుగుతున్నారని ప్రశ్నించారు. వినోద్ కుమార్ వలస వాది అని.. తన నియోజకవర్గంలో పోటీ చేసుకోవాలని సూచించారు. ఆగస్టు 15 నాటికి 2 లక్షల రైతు రుణమాఫీతో పాటు.. 500 బోనస్ ఇస్తామని హామీ ఇచ్చారు. కరీంనగర్ లోక్‌సభకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలన్నారు. పార్టీ సూచనల మేరకే నామినేషన్ వేశామని, రాజేందర్ రావు చదువుకున్న వ్యక్తి అని, అవకాశం ఇవ్వాలని సూచించారు. నియోజవర్గంపై పూర్తి అవగాహన ఉందన్నారు. ప్రభుత్వాన్ని కూలగొడతా అన్నవాడికి ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. పార్లమెంట్ నియోజకవర్గంలో రేపటి నుండి డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కార్యక్రమాలు నిర్వహిస్తారని, అన్ని బూత్‌లలో మెజారిటీ సాధించాలని కోరారు.

## బంగారు కరీంనగర్‌కు బాటలు వేస్తా

**కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావు**

ప్రజలు తనకు ఎంపీ అవకాశం ఇస్తే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం అభివృద్ధికి బంగారు బాటలు వేస్తానని, బంగారు కరీంనగర్ చేస్తానని ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావు స్పష్టం చేశారు. నామినేషన్ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 'నామినేషన్‌కు ప్రోత్సహం ఇచ్చిన అందరికీ ధన్యవాదాలు. కరీంనగర్ అభ్యర్థిగా మంత్రి అంచనాలకు అనుగుణంగా ముందుకు సాగుతా. కరీంనగర్ ప్రజలు నాకు ఒక్కసారి అవకాశం ఇవ్వాలి' అని కోరారు. కరీంనగర్‌కు తమ కుటుంబానికి ఎనలేని అనుబంధం ఉందని, కార్మికులు, డాక్టర్లు, ఇంజినీర్లు.. ఇలా అన్నివర్గాల ప్రజలతోనూ తమకు సత్సంబంధాలు ఉన్నాయని చెప్పారు. తాను అలవోకగా.. 10 నుంచి 15 వేల మందిని పేర్లతో పిలుస్తానని, వారితోనే కాకుండా వేల సంఖ్యలో పరిచయాలు ఉన్నాయని చెప్పారు. మా తండ్రి జగపతి రావు అందరికీ సుపరిచితులేనని, తన తండ్రి ఆలోచనలకు అనుగుణంగా పోతానని మాట ఇచ్చారు. కరీంనగర్‌ను అభివృద్ధి చేయాలనేదే తన తపన అని చెప్పారు. పదేళ్ల మోడీ పాలనలో ప్రజలు విసిగిపోయారని, పాంచ్ న్యాయ్‌తో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. వినోద్ కుమార్‌కు ఒకసారి అవకాశం ఇచ్చారని.. ఆయనతో పార్లమెంట్ నియోకవర్గానికి ఒరిగిందేమీ లేదని అన్నారు. అలాగే.. బండి సంజయ్‌కి సైతం అవకాశం ఇచ్చారని.. ఆయనా నియోజకవర్గ ప్రజలకు ఏమీ చేయలేదని పేర్కొన్నారు. వీరిద్దరి హయాంలో నియోజకవర్గం ఏపాటి అభివృద్ధి చెందిందో ఆలోచించాలని కోరారు. అంతకుముందు పొన్నం ప్రభాకర్ ఎంపీగా చేసినప్పుడు జరిగిన అభివృద్ధి తప్పితే.. వీరు చేసిందేమీ లేదని అన్నారు. మంత్రి ప్రభాకర్ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం కష్టపడ్డారని, స్కీములు తీసుకొచ్చారని చెప్పారు. పొన్నం ఆధ్వర్యంలో నడుస్తున్న తనకు సైతం అవకాశం కల్పించి పార్లమెంటుకు పంపించాలని కోరారు.

TELANGANA CAPITAL
తెలంగాణ క్యాపిటల్
నిజం.. నిజాయితీ.. నిబద్ధత
TELANGANA CAPITAL NEWS
www.telanganacapitalnews.com



## గరుడ వాహనంపై నారసింహుడు



**తెలంగాణ క్యాపిటల్, బెజ్జంకి:** సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉత్సవమూర్తులను గరుడ వాహనంపై ఉంచి శోభాయాత్ర నిర్వహించారు. ఈ శోభాయాత్రలో మహిళలు మంగళహారతులతో పాల్గొన్నారు. ముడుపులను చెల్లించుకుని స్వామివారి కృపకు పాత్రులు అయ్యారు. బెజ్జంకి గ్రామంలోని పురవీధుల గుండా సాగిన శోభాయాత్ర అందరినీ ఆకట్టుకుంది. శోభాయాత్రలో భాగంగా స్వామివారి ఉత్సవ విగ్రహాల కింద నుండి అటూ ఇటూ తిరిగి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

## గూడెం వాసుల నిరాహార దీక్ష ఎత్తివేత



**తెలంగాణ క్యాపిటల్, బెజ్జంకి:** మూడెకరాల భూమి కోసం అర్హులకు కేటాయించలేదని, అనర్హులకు కేటాయించారని, వాటిని రద్దుచేసి గ్రామ సభ నిర్వహించి అర్హులకు ఇవ్వాలని 41 రోజులుగా డిమాండ్ చేస్తున్న గూడెం గ్రామస్తులు దీక్షా శిబిరాన్ని సోమవారం విరమించుకున్నారు. ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల కోడ్ ఉన్నందున దీనిని తాత్కాలికంగా వాయిదా వేస్తున్నామని, ఎన్నికల అనంతరం తమకు న్యాయం జరుగుతుందని నమ్మకం ఉందని వారు తెలిపారు. ఎన్నికల అనంతరం 10 రోజులపాటు వేచిచూస్తామని, పరిస్థితిలో మార్పు రాకపోతే తాము తమ పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

### కాంగ్రెస్ పార్టీ ఎన్నికల వార్ రూమ్ ప్రారంభం

**తెలంగాణ క్యాపిటల్, కరీంనగర్ టౌన్:** కరీంనగర్ డీసీసీ కార్యాలయంలో జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే, డా.కవ్వంపల్లి సత్యనారాయణతో పలువురు నాయకులతో కలిసి ఎన్నికల వార్ రూమ్‌ను ప్రారంభించారు. ఈ వార్ రూమ్ ద్వారా కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన ఎన్నికల వ్యవహారాలు, ఫిర్యాదులు, సూచనలు, సలహాలు, అభిప్రాయాలు స్వీకరించడం జరుగుతుందని వారు తెలిపారు. ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ అధిష్టానం అందజేసిన సమాచారాన్ని క్షేత్రస్థాయి కార్యకర్తలకు చేరవేయడం, తద్వారా కార్యకర్తల ఫలితాన్ని పర్యవేక్షణ చేయడం, తదితర అంశాలపై వార్ రూమ్‌లో కార్యాచరణ కొనసాగుతుందని పేర్కొన్నారు. ప్రచార సామగ్రి అందజేయనున్నారు.

# ఎన్నికల ప్రచారంలో బిజెపి బూత్ లెవల్ కమిటీ సభ్యులు



**తెలంగాణ క్యాపిటల్, ఇల్లంతకుంట:** ఇల్లంతకుంట మండలంలోని వివిధ గ్రామాలలో బిజెపి కార్యకర్తలు బూత్ లెవల్ కమిటీ సభ్యులు గ్రామాల్లో ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. ఇప్పటికే మండలంలోని 14 గ్రామాల్లో ఇంటింటా ప్రచారం పూర్తి చేశారు. బిజెపి 58 బూతులకు బూత్ లెవెల్ కమిటీ పేరుతో 20 మంది సభ్యులను నియమించి అందులో ఒకరిని అధ్యక్షునిగా కొనసాగిస్తున్నారు. వచ్చేనెల 13న కరీంనగర్ పార్లమెంటు ఎన్నికలు జరగనున్నాయి. తమ పార్టీ అభ్యర్థి బండి సంజయ్ కుమార్ ను గెలిపించాలని బూత్ లెవెల్ కమిటీ సభ్యులు, పార్టీ కార్యకర్తలు, ఇంటింటా తిరుగుతూ ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. ఓ అడుగు ముందుకేసి కొన్ని గ్రామాల్లో ఉపాధి హామీ కార్మికులు పనిచేసే క్షేత్రాల వద్దకు వెళ్లి కరపత్రాలు పంచుతూ ప్రధానమంత్రి మోడీ ప్రజలకు ఇచ్చే సంక్షేమ పథకాలు గురించి వివరంగా చెప్పుతున్నారు. బిజెపి మానకొండూరు అసెంబ్లీ కో కన్వీనర్ బత్తిని స్వామి మాట్లాడుతూ ఇప్పటివరకు మండలంలో సగభాగం బూత్ లెవెల్ ప్రచారం ముగించామని, ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థి బండి సంజయ్ భారీ మెజారిటీతో గెలుస్తారని ఆశాభావం వ్యక్తపరిచారు. సోమవారం రహీంఖాన్ పేట గ్రామంలో 293 బూత్ లెవెల్ సభ్యులు ఇంటింటా బిజెపి ఎన్నికల ప్రచారం చేశామని బత్తిని స్వామి తెలిపారు. వీరితోపాటు బూత్ లెవెల్ సభ్యులు జెట్టి హరికృష్ణ, నీలి శ్రీనివాస్, తొత్తుల మల్లేశం, రమేష్ పాల్గొన్నారు. బిజెపి మండల అధ్యక్షుడు కొత్త శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఇప్పటివరకు మండలంలో నర్సక్కపేట, పొత్తూరు, రేపాక, ఆరేపల్లి, ముస్కానిపేట, పత్తికుంటపల్లి, సిరికొండ, దాచారం, రామోజీపేట, ఓబులాపురం, వల్లంపట్ల, కందికట్కూర్, రహీంఖాన్ పేట వంతడుపుల అంతగిరి, రేపాక గ్రామాలలో బూత్ లెవెల్ కమిటీ ప్రచారం పూర్తికావచ్చిందని మిగతా గ్రామాలలో కూడా బూత్ లెవెల్ ప్రచారం కొనసాగుతుందని త్వరలో అన్ని గ్రామాలలో పూర్తి చేస్తామని తెలిపారు.

## వలసవాదులతో అభివృద్ధికి ఆటంకం

**బీఆర్ఎస్ పార్టీ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్**



**తెలంగాణ క్యాపిటల్, పెద్దపల్లి:** వలసవాదులతో అభివృద్ధికి ఆటంకం కలుగుతుందని, అలాంటి వారికి పార్లమెంట్ ఎన్నికల్లో సరైన బుద్ధి చెప్పాలని మాజీ మంత్రి, పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పార్లమెంట్ ఎన్నికల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం కొప్పుల మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో అన్నివర్గాల ప్రజలను ఆదుకొని ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి వారి అభి వృద్ధికి కృషి చేశామ న్నారు. అలాగే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయకుండా ప్రజలను నట్టేటా ముంచిందని విమర్శించారు. రైతులకు రుణమాఫీ, రైతుబంధు ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలను ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో దాసరి ఉషతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## సకాలంలో ధాన్యం కొనుగోలు చేయాలి

**పెద్దపల్లి అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్**



**తెలంగాణ క్యాపిటల్, పెద్దపల్లి:** జిల్లాలో రైతులు పండించిన ధాన్యాన్ని మద్దతు ధరపై సకాలంలో కొనుగోలు చేయాలని అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్ ప్రసాద్ లాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం అదనపు కలెక్టర్ పెద్దపల్లి, సుల్తానాబాద్ మార్కెట్ యార్డులలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యాసంగి సీజన్ కు సంబంధించి నాణ్యమైన ధాన్యాన్ని చివరి గింజ వరకు మద్దతు ధరపై కొనుగోలు చేస్తామన్నారు. నాణ్యత ప్రమాణాల ప్రకారం తేమ శాతం వచ్చిన తర్వాత ధాన్యాన్ని త్వరితగతిన కొనుగోలు చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. అవసరమైన వాహనాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకొని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు కేంద్రాల నుంచి సంబంధిత మిల్లర్లకు తరలించాలని, రైస్ మిల్లు వద్ద ఎట్టి పరిస్థితుల్లో ధాన్యం కోత కాకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు అవసరమైన టార్పాలిన్ కవర్లు అందుబాటులో పెట్టాలని, కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ఎప్పటికప్పుడు ట్యాబ్ లలో నమోదు చేసి రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చూడాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై జిల్లా మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి, సంబంధిత శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# 6 గ్యారంటీలను అమలు చేయకుంటే మెడలు వంచుతా

**కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలారా.. రాముడంటే భయమెందుకు?**

**దయ్యాలు, భూతాలు, సైతాన్లు మాత్రమే దేవుడంటే భయపడతాయి**

**గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి అంతా కేంద్రం చలువే**

**హుస్నాబాద్‌లో కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై నిప్పులు చెరిగిన సంజయ్**





**(తెలంగాణ క్యాపిటల్, హుస్నాబాద్)**

'కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారంటీల పై ప్రశ్నిస్తుంటే కొందరు నాపై అవాకులు, చవాకులు పేలుతున్నరు. ఇక్కడి మంత్రి నన్ను వెధవ అంటూ బూతులు తిడుతున్నడు. అయినా నేను పడతా.. కానీ ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారంటీలను అమలు చేయకుంటే మాత్రం కాంగ్రెస్ మెడలు వంచుతా' అంటూ బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ అన్నారు. తాము శ్రీరాముడిని ఆరాధిస్తుంటే.. కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు మాత్రం దేవుడు పేరు వింటే ఎందుకు భయపడుతున్నాయో అర్థం కావడం లేదన్నారు. నాకు తెలిసి దయ్యాలు, భూతాలు, సైతాన్లు మాత్రమే దేవుడంటే భయపడతాయని పేర్కొన్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఎస్సీ, ఎస్టీల పేరుతో విడుదల చేసిన చేవెళ్ల డిక్లరేషన్ లో ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. 'బిడ్డా.. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు టెన్త్ పాసైతే రూ.10 వేలు, ఇంటర్ పాసైతే రూ.15 వేలు, డిగ్రీ పాసైతే రూ.25 వేలు, పీజీ చేస్తే రూ.లక్ష ఇస్తానని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి. లేకుంటే.. మిమ్ముల్ని గ్రామాల్లో తిరగనీయం. ఎన్నికల తరువాత మాట తప్పి మోసం చేస్తున్న కాంగ్రెస్ నేతలను ఎక్కడికక్కడ అడ్డుకుని తీరుతాం...' అంటూ అల్టిమేటమిచ్చారు. సోమవారం హుస్నాబాద్ పట్టణానికి విచ్చేసిన బండి సంజయ్ కు బీజేపీ కార్యకర్తలు పెద్ద ఎత్తున ఘన స్వాగతం పలికారు. ముఖ్యంగా భారీ ఎత్తున గిరిజన మహిళలు తరలివచ్చి లంబాడా సాంప్రదాయంలో స్వాగతం పలికారు. అనంతరం బీజేపీ కార్యకర్తలు, నాయకులతో కలిసి హుస్నాబాద్ లోని తిరుమల గార్డెన్ లో నియోజకవర్గస్థాయి సమావేశంలో పాల్గొన్నారు. అక్కన్నపేట మండలంలోని కట్కూరు, కుందనవాని పల్లె, దుబ్బతండ గ్రామాల తాజా మాజీ సర్పంచులు అశోక్ రెడ్డి, దినేష్ రెడ్డి, కవిత, పీఏసీ చైర్మన్ రాజయ్యతోపాటు సింగిల్ విండో మాజీ చైర్మన్ నారాయణరెడ్డి, లావణ్య కుమార్, నారాయణ, సిద్దారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన వందలాది మంది నాయకులు బండి సంజయ్ సమక్షంలో బీజేపీ లో చేరారు. వారికి సంజయ్ కాషాయ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కార్యకర్తలకు సంజయ్ బంపర్ ఆఫర్ ప్రకటించారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 80 నుండి 100 శాతం ఓటింగ్ నమోదయ్యేలా కృషి చేసిన వారికి రూ.10 వేల ప్రోత్సాహక నగదు అందజేస్తామని చెప్పారు. ఈ సమావేశానికి నిజామాబాద్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్ గౌడ్, ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కళ్యాణ్ నాయక్, పార్టీ రాష్ట్ర నాయకులు బొమ్మ శ్రీరాం చక్రవర్తి, రాంగోపాల్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడుతూ.. గ్రామాల్లో అభివృద్ధి అంతా కేంద్ర నిధులతోనే జరిగిందని, మోదీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి కాంగ్రెస్, బీఆర్ఎస్ నుండి బీజేపీ లో చేరుతున్నారని అన్నారు. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని, కేంద్రంలో మళ్లీ మోదీని ప్రధాని కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో 6 గ్యారంటీలను అమలు చేస్తామని ఓట్లు దండుకుని గద్దెనెక్కిన కాంగ్రెస్.. వాటిని ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. తనను ఓడించడానికి కేసీఆర్ కరీంనగర్ వస్తున్నాడట అని, కరీంనగర్ ప్రజలంతా ఆలోచించాలని కోరారు. అంతకుముందు సంజయ్ స్థానిక బార్ అసోసియేషన్ సభ్యులను కలిశారు. ఈ సందర్భంగా సంజయ్‌ని వారంతా సన్మానించారు. వారి సమస్యలను వివరించారు.

**గీత కార్మికులను ఆదుకోండి**

ఎంపీ బండి సంజయ్ హుస్నాబాద్ నియోజకవర్గంలోని పొట్లపల్లి సమీపంలో కాలిపోయిన తాటి చెట్లను పరిశీలించారు. అక్కడున్న గీత కార్మికులు, స్థానికులను కలిసి తాటి చెట్ల దగ్ధానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. నష్టపోయిన గౌడన్నలను పరామర్శించారు. అనంతరం సంజయ్ మాట్లాడుతూ 'గౌడన్నలు ప్రమాదవశాత్తు చనిపోతే పైసలివ్వడం కాదు.. బతికున్నప్పుడు కూడా ఆదుకోవాలి. ఉపాధి కల్పించాలి. ప్రమాదవశాత్తు తాటి చెట్లు కాలిపోతే అన్నివిధాలా ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది' అని అన్నారు.

## చెక్‌పోస్ట్ వద్ద పకడ్బందీగా తనిఖీలు



**తనిఖీలు నిర్వహించిన పెద్దపల్లి కలెక్టర్, సీపీ**

**తెలంగాణ క్యాపిటల్, పెద్దపల్లి:** పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా స్ట్రాగ్ రూమ్, కోటపల్లి మండలం రాపాన్‌పల్లి అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్టుల్లో విధులు నిర్వర్తిస్తున్న పోలీస్ అధికారులు 24 గంటలు పకడ్బందీగా అప్రమత్తంగా ఉండాలని రామగుండం సీపీ ఎం.శ్రీనివాస్ సూచించారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. సోమవారం రామగుండం సీపీ, మంచిర్యాల కలెక్టర్ సంతోష్ దారవాత్‌తో కలిసి కిష్టంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్, సరిహద్దు చెక్ పోస్ట్‌లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. బస్సులను, ద్విచక్ర వాహనాలను సైతం తనిఖీ చేయాలన్నారు. వాహనాల తనిఖీలు నిర్వర్తించే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని, రాత్రి సమయంలో రేడియం జాకెట్స్ ఉపయోగించాలని సూచించారు. అక్రమంగా డబ్బు, మద్యం, బంగారం విలువైన వస్తువులు తరలిస్తుంటే పట్టుకోవాలని సూచించారు. రూ.50వేల కంటే ఎక్కువ అమౌంట్ తీసుకెళ్తుంటే తగిన ధ్రువపత్రాలు లేకపోతే అమౌంట్ సీజ్ చేసి గ్రీవెన్స్ కమిటీకి అప్పగించాలని సూచించారు. రూ.10 లక్షల కంటే ఎక్కువ అమౌంట్ సీజ్ చేస్తే ఇన్‌కం టాక్స్ డిపార్ట్మెంట్ కు అప్పజెప్పాలని అన్నారు. చెక్ పోస్ట్ దగ్గర విధుల్లో ఉండే పోలీసులకు కావలిసిన అవసరాలను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. మంచిర్యాల డీసీపీ అశోక్ కుమార్, మంచిర్యాల ఏసీపీ ప్రకాష్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘువేంద్ర రావు, శ్రీరాంపూర్ సీఐ మోహన్, చెన్నూర్ టౌన్ ఇన్‌స్పెక్టర్ రవీందర్, కోటపల్లి ఎస్ఐ రాజేందర్, భీమారం ఎస్ఐ రాములు, రెవెన్యూ అధికారులు తదితరులు ఉన్నారు.



## పెద్దపల్లి పార్లమెంట్ స్థానానికి 14 నామినేషన్లు

**తెలంగాణ క్యాపిటల్, పెద్దపల్లి:** పెద్దపల్లి పార్లమెంటు స్థానానికి సోమవారం 14 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. స్వతంత్ర అభ్యర్థులుగా దుర్గం సమ్మయ్య, అక్కపాక తిరుపతి (రెండవ సెట్), ఆర్నకొండ రాజు, గడ్డం మారుతి, రాముల కార్తీక్, జుమ్మిడి గోపాల్, అంబాల మహేందర్, జనగామ నరేష్, ముల్కల్ల రాజేంద్ర ప్రసాద్, జాడి ప్రేమ్ సాగర్ (రెండవ సెట్), దాగం సుధారాణి, ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థిగా మంద రమేష్ తలా ఒక సెట్ దాఖలు చేశారు. అదేవిధంగా స్వతంత్ర అభ్యర్థులు గద్దల వినయ్ కుమార్, బొట్ల చంద్రయ్య తలా రెండు సెట్ల నామినేషన్ పత్రాలను దాఖలు చేశారని పేర్కొన్నారు. ఇప్పటివరకు నాలుగు రోజుల్లో 25 మంది అభ్యర్థులు మొత్తంగా 31 సెట్ల నామినేషన్లు దాఖలు చేసినట్లు కలెక్టర్ తెలిపారు.



TELANGANA CAPITAL
తెలంగాణ క్యాపిటల్
నిజం.. నిజాయితీ.. నిబద్ధత
www.telanganacapitalnews.com



## వంశీ గెలుపునకు అహర్నిశలు

# కృషి చేయాలి




పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు

**తెలంగాణ క్యాపిటల్, పెద్దపల్లి:** పెద్దపల్లి ఎంపీగా గడ్డం వంశీ గెలుపునకు అహర్నిశలు కృషి చేయాలని ఎమ్మెల్యే విజయరమణారావు పిలుపునిచ్చారు. సోమవారం ఎలిగేడు, జూలపల్లి మండలాల్లో పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా విజయరమణా రావు ఆధ్వర్యంలో ప్రచార సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజయరమణా రావు మాట్లాడుతూ.. పెద్దపల్లి పార్లమెంటు ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఆనాడు తాను గడపగడపకూ కాంగ్రెస్ పార్టీ.. పల్లెపల్లెకు విజ్జన్న అనే నినాదంతో ప్రతీ గ్రామానికి వెళ్ళినప్పుడు ప్రజల కష్టాలు చూశానని, పార్టీ నాయకులు, కార్యకర్తల కష్టంతో తాను ఎమ్మెల్యేగా గెలుపొందానని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన 5 న్యాయ గ్యారంటీలను ప్రజలకు వివరించాలన్నారు. బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి అయిన కొప్పుల ఈశ్వర్ ఆనాడు మంత్రిగా ఉన్నప్పుడు వడ్ల కోత పెట్టినప్పుడు ఎక్కడ ఉన్నారో చెప్పాలని అన్నారు. ప్రజల కష్టాలు పట్టించుకోని ఈశ్వర్ ఇప్పుడు ఓట్లు ఎలా అడుగుతున్నారని నిలదీశారు. బీఆర్ఎస్ పార్టీ నుండి జూలపల్లి మండలానికి చెందిన వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

## జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభం




**తెలంగాణ క్యాపిటల్, మెట్‌పల్లి:** మెట్‌పల్లి మినీ స్టేడియంలో జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలను జిల్లా స్థాయి అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రధాన కార్యదర్శి ఏలేటి ముత్తయ్య రెడ్డి ప్రారంభించారు. అనంతరం విద్యార్థులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నతనం నుండి క్రీడల పట్ల దృష్టి సారించాలని, క్రీడల వల్ల స్నేహాభావం పెరుగుతుందని అన్నారు. గెలుపు ఓటములు సహజంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా నలుమూలల నుండి దాదాపు 150 మంది పాఠశాల విద్యార్థులు, కళాశాల విద్యార్థులు వచ్చారు. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులను ఈనెల 28న సూర్యాపేటలో జరిగే రాష్ట్రస్థాయి వంద మీటర్ల రన్నింగ్, 400 మీటర్స్, 800 మీటర్స్, 1,500 మీటర్స్, 2,000 మీటర్స్, 5 కేఎం పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గజేల్లి రాందాస్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## హనుమాన్ చిన్న జయంతి

# ఉత్సవాలు ప్రారంభం



**తెలంగాణ క్యాపిటల్, కొండగట్టు:** జగిత్యాల జిల్లా కొండగట్టు ఆలయంలో సోమవారం ఉదయం నుండి హనుమాన్ చిన్న జయంతి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామున నుండి గుట్ట పైకి దీక్ష స్వాములు చేరుకొని స్వామివారిని దర్శించుకున్నారు. మాల విరమణ చేశారు. అంతరాలయంలో స్వామివారి దర్శనం సందర్భంగా జై శ్రీరామ్ నినాదాలతో ఆలయ పరిసరాలు మారుమోగాయి. మాల విరమణ అనంతరం తలనీలాలు సమర్పించుకుని మొక్కలు చెల్లించుకొని భక్తులు తిరుగు పయనమయ్యారు. భక్తుల కోసం మాలవిరమణ మండపం, తలనీలాల వద్ద అధికారులు ఏర్పాట్లు చేశారు. తెల్లవారుజామున 3,000 మంది దీక్షాపరులు మాల విరమణ చేసినట్లు అధికారులు తెలిపారు. సుమారు 15,000 మంది వరకు భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు చెప్పారు.




## హనుమాన్ శోభాయాత్ర

**తెలంగాణ క్యాపిటల్, మెట్‌పల్లి:** మెట్‌పల్లి పట్టణంలో విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో హనుమాన్ శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. అరపేట శివాలయం నుంచి అయ్యప్ప టెంపుల్ వరకు శోభాయాత్ర కొనసాగింది. డీఎస్పీ ఉమామహేశ్వర్ రావు ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.

## పీహెచ్‌సీలో ఎల్‌సీడీసీ సర్వే

**తెలంగాణ క్యాపిటల్, ఇల్లంతకుంట:** ఇల్లంతకుంట మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎల్‌సీడీసీ కుష్టు వ్యాధి గ్రస్తుల సర్వే సోమవారం నిర్వహించారు. 45 మందిని పరీక్షించగా ఇద్దరికి కుష్టు వ్యాధి నిర్ధారణ అయినట్టు ఎన్ఎల్ఈపీ బృందం పేర్కొంది. వీరికి ఆరు నెలలపాటు మందులు వాడాలని డాక్టర్లు సూచించారు. ఈ కార్యక్రమంలో డీపీఎంఓ కాశీనాథ్ శ్రీనివాస్ పాల్గొన్నారు. కాశీనాథ్ ఈనెలలో ఉద్యోగ విరమణ చేస్తుండడంతో ఇల్లంతకుంట డాక్టర్ శరణ్య, హెచ్ఈఓ రమణ ప్రసాద్,



సూపర్‌వైజర్ ఎండి నయీమ్, సీహెచ్ఓ శాంత, జవహర్ ఏఎన్ఎం, ఆశా వర్కర్లు తదితరులు సన్మానించారు.

తెలంగాణ క్యాపిటల్ పేపర్‌లో వార్తల కోసం ఈ నంబర్‌లో సంప్రదించగలరు : 92949 92992

GENERAL NEWS

# బ్రహ్మోత్సవాల సందర్భంగా వాహన సేవలు ఎందుకంటే?





**తెలంగాణ క్యాపిటల్, బెజ్జంకి:** బెజ్జంకిలోని శ్రీ లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా రోజుకో వాహనంపై, వివిధ రకాల సేవలు, ఉత్సవమూర్తుల విగ్రహాలతో గ్రామ ప్రదక్షిణ చేయిస్తున్నారు. అయితే.. అవి ఎందుకు చేస్తారో ఎవరికి సరిగా అవగాహన ఉండదు. వాటికి సంబంధించి.. మునిగంటి శ్రీ వాత్సవ వేద పండితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏకాదశి రోజున స్వామి వారి కళ్యాణం జరుగుతుంది. తెల్లవారి అశ్వవాహనం, సింహ వాహనం, గరుడ వాహనం, గజవాహన సేవలు ఉంటాయి. ఏ ఆలయంలోనైనా షడ్ బేరాలు ఉంటాయి. అవి ధ్రువ, శయన, స్తంభన, ఉత్సవ బేరాలు. ధ్రువబేరం అనగా మూల విరాట్ స్వామి లక్ష్మీనరసింహస్వామి వారు. స్వయంభుగా భక్తుల కోసం ఉద్భవించిన అవతారమూర్తి. శ్రీ లక్ష్మీనరసింహస్వామి అవతారం బెజ్జంకిలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి గుట్టపై స్వయంభుగా వెలిసిన స్వామి వారిని ధ్రువ బేరం అంటారు. లోపలనున్న స్వామి వారి వద్దకే మనం వెళ్లాలి. భక్తులంతా వెళ్లలేని పక్షంలో వారు ఉన్న చోటికి భక్తులను అనుగ్రహించటానికి భగవంతుడు వివిధ వాహనాల రూపాలలో బయటకు వచ్చి ఊరినంతటిలో విహరిస్తారు. భక్తులను ఆశీర్వదించటానికి, అనుగ్రహం ఇవ్వటానికి ఈ వాహనాల పైన భగవంతుడు వివిధ వాహనాలపై భక్తుల చెంతకు వస్తున్నారు. హంస, సింహ, గరుడ గజ వాహనాలపై రావడం జరుగుతుంది. చివరి రోజు రథోత్సవం ఉంటుంది. రథంపై ఉన్న ఉత్సవమూర్తులను దర్శించుకుంటే పునర్జన్మ ఉండదనే విశ్వాసం ఉంది. హంస వాహన సేవ ఎందుకంటే పాలల్లో నీళ్ల కలిపి హంసకు ఇస్తే నీటిని వదిలి పాలన మాత్రమే సేవిస్తుందని మనకు తెలుసు. అలాగే స్వామివారు సైతం భక్తుల చెంతకు రావడం కూడా భక్తులంతా చెడును వదిలేసి, మంచి మార్గంలో నడిస్తే ఆ భగవంతున్ని చేరుకోగలరని నమ్మకం కలిగించడానికి హంస వాహనంపై వస్తారని ప్రచారం ఉంది. భగవంతుడు భక్తులను అనుగ్రహించడానికి వివిధ వాహన రూపాలలో గ్రామ పర్యటన కావిస్తారని వేద పండితులు తెలుపుతున్నారు.

## కరీంనగర్‌లో 13 మంది నామినేషన్ల దాఖలు




**తెలంగాణ క్యాపిటల్, కరీంనగర్ టౌన్:** కరీంనగర్ లోక్‌సభ స్థానానికి 13 మంది సోమవారం నామినేషన్లను దాఖలు చేశారు. జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పమేలా సత్పతికి తన చాంబర్లో నామినేషన్ పత్రాలను అందజేశారు. కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావు నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, మానకొండూర్, చొప్పదండి ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం పాల్గొన్నారు. మొత్తం నాలుగు సెట్ల నామినేషన్ పత్రాలను కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావు నాయకులతో కలిసి వేర్వేరుగా అందజేశారు. నామినేషన్లు దాఖలు చేసిన వారి వివరాలు ఇలా ఉన్నాయి. వెలిచాల రాజేందర్ రావు (కాంగ్రెస్ అభ్యర్థి, నాలుగు సెట్లు), చింత అనిల్ కుమార్ (పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా), దేవునూరి శ్రీనివాస్ (ఇండిపెండెంట్), బంక రాజు (ఇండిపెండెంట్ రెండు సెట్లు), అబ్బిడి బుచ్చిరెడ్డి (ఇండిపెండెంట్), తాళ్లపల్లి అరుణ (ఆధార్ పార్టీ), గట్టు రాణా ప్రతాప్ (సోషలిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా), చిలువేరు శ్రీకాంత్ (ధర్మ సమాజ్ పార్టీ), గవ్వల లక్ష్మి (ఇండిపెండెంట్), జింక శ్రీనివాస్ (ఇండిపెండెంట్), బరిగె గట్టయ్య యాదవ్ (ఇండిపెండెంట్), లింగంపల్లి శ్రీనివాసరెడ్డి (ఎంసిపిఐ), ఎండీ జిషాన్ (ఇండిపెండెంట్) నామినేషన్లు దాఖలు చేశారు.

## ఘనంగా పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ



**తెలంగాణ క్యాపిటల్, చిగురుమామిడి:** ముదిరాజ్ కులస్తుల ఆరాధ్య దైవమైన శ్రీ పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్టను సోమవారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు జక్కుల బాబు ఆధ్వర్యంలో ఉదయం నుండి ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు, హోమం నిర్వహించి అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్టించారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ నిర్మాణంలో భాగస్వామ్యమైన గ్రామస్తులకు భక్తులకు పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొత్త శ్రీనివాస్ రెడ్డి, మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య, ముదిరాజ్ సంఘం అధ్యక్షులు జక్కుల బాబు, తాజా మాజీ సర్పంచ్ లు జక్కుల రవీందర్, సన్నీల్ల వెంకటేష్, లక్ష్మీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గాదె రఘునాథ్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బోయిని రమేష్, సంఘం కార్యదర్శి జక్కుల మల్లేశం పాల్గొన్నారు.

## హైనా దాడిలో దూడ మృతి

**తెలంగాణ క్యాపిటల్, చిగురుమామిడి:** మండలంలోని సుందరగిరి గ్రామ శివారులో గల గండికోట రాయమ ల్లుకు చెందిన వ్యవ సాయ పొలం కట్టేసిన దూడపై హైనా దాడి చేసింది. ఈ ఘటనలో దూడ మృతి చెందింది. ఈ సంఘటన ఆదివా రం రాత్రి జరిగింది. రైతు రాయమల్లు చెప్పిన కథనం ప్రకారం.. రోజు మాదిరిగానే తన వ్యవసాయ పొలంలోని ఆదివారం దూడను కట్టేసి వెళ్లాడు. సోమవారం ఉదయం పొలం దగ్గరికి రాగానే దూడ మృతి చెంది ఉంది. సమీపం లో ఉన్న పాదముద్రలు హైనా జంతువుయని తెలిసి ఈ సమాచారాన్ని సంబంధిత అటవీ శాఖ అధికారులకు చెప్పినట్లు తెలిపారు. సోమవారం ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ సంఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. నష్టపోయిన రైతును ఆదుకోవాలని స్థానికులు కోరారు.

## పొత్తూరులో వేంకటేశ్వర స్వామి జాతర

**తెలంగాణ క్యాపిటల్, ఇల్లంతకుంట:** ఇల్లంతకుంట మండలంలోని పొత్తూరు గ్రామంలో శ్రీ వేంకటేశ్వర స్వామి జాతరలో భాగంగా సోమవారం సాయంత్రం శకటోత్సవం వైభవోపేతంగా జరిగింది. గ్రామంలోని ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు, డప్పులతో ర్యాలీగా వెళుతూ ఊరు చివరన ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. అదేవిధంగా మంగళవారం తెల్లవారుజామున రథోత్సవం ఉంటుందని, బుధవారం అన్నదాన కార్యక్రమం ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. ఎస్సై రాజు గౌడ్ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. సిరిసిల్ల జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సిద్ధం వేణు జాతరలో పాల్గొన్నారు. చుట్టుపక్క గ్రామాలైన గన్నేరువరం, నర్సక్కపేట, కందికట్కూర్, గాలిపెల్లి, మల్లాపురం తదితర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



